# నాకూ అమ్మ ఉంది

మంగళవాద్యాలతో ఇల్లు మారుమ్రోగుతున్నది. ఎక్కడ చూచినా చిక్కని ఆనందం తాండవిస్తున్నది. పచ్చని మామిడితోరణాలతో, రంగు రంగుల కాగితపు గుమ్మటాలతో అరుదేరనున్న శుభదేవతకు ఆహ్వాన వేదికలా వుంది పెళ్ళిపందిరి.

చిన్న పెద్దల తారతమ్యం లేకుండా అందరికీ ఒకటే హడావిడి. ఏ మహానుభూతికోసమో పరుగులు తీస్తున్న కళాహృదయంలా, పట్టుచీరల గరగరలతో మల్లెమాలతుల పరిమళాలు మేళవించగా పెళ్ళిపందిరి పగిలిన సెంటుబుడ్డిలా గుబాళిస్తున్నది.

పురోహితుని కంఠంతో తమ గొంతుకలు కలిపి మంత్రపఠనం చేస్తున్నారు బ్రాహ్మణులు. ఆ శుభముహూర్తాన నవయవ్వన విలాసిని వాసంతి రాజశేఖరం భార్యగా అవతరించింది. తలమీది అక్షతలు దులుపుకొనే నెపంతో, ఓరగంట రాజశేఖరాన్ని చూసి, చిరునవ్వు చిందించింది. ముత్తయిదువలు చేయూత నిచ్చి వాసంతిని లేవదీస్తున్నారు.

వాసంతి వివాహవేదిక నుండి రెండు అడుగులు వేసింది. చావిట్లో ఎవరివో కేకలు, అదలింపులు.... "నన్ను పోనీండి. నేను పిన్నిని చూస్తాను."

ఎవరిదో సముదాయింపు.

"నేను వినను. ఎవ్వరిమాటా వినను. నన్ను పోనీండి."

"పట్టుకోండర్రా వెధవని. వేలెడంత లేదు వీడి ఇష్టంట.... ఇష్టం...."

"అబ్బ! వెధవకానా! చెయ్యి కరిచిపోయేవురా, ఉండు నీపని చెప్తా" బాధామిళిత మయిన దండింపు.

ఒక్క పరుగుతో అందరినీ తప్పించుకొంటూ వచ్చి వాసంతి ముందు నిల్చున్నాడు అయిదేళ్ళ కుర్రాడు బాబు. చెరిగిన తల, మట్టి కొట్టుకుపోయిన జోళ్ళు, సిరా మరకలతో వున్న షర్టు, ఒక కాలు పైకి పోయిన నిక్కరు. ఇదీ బాబు అవతారం. ఇద్దరి చూపులు క్షణకాలం కలిసి నిలిచాయి. ఏదో అవాంఛనీయ కార్యం జరిగిపోయినట్లు స్తబ్ధులయారిద్దరూ.

"ఈ టీచరా మా పిన్ని" అన్నాడు బాబు బాధగా. ఆ చూపులో ఆ ధ్వనిలో అయిష్టం, కోపం ప్రస్ఫుటమవుతున్నాయి.

"ఈ బాబు తండ్రినా తను పెళ్ళాడింది" ఏదో అవ్యక్త భయం ఆవహించింది వాసంతిని. ఆ అయిదేళ్ళ పసివాని నిరసనతో వాసంతిలో పరవళ్లు తొక్కుతున్న ఆనందవెల్లువ అధోముఖం అయింది.

రాజశేఖరానికి ఇది ద్వితీయ వివాహం అన్న సంగతి ఆమెకు తెలియంది కాదు. అయిదేళ్ళ కొడుకున్నాడన్న సంగతికూడా గోప్యంగా లేదు. కాని.... కాని, ఆ కొడుకే

బాబు రూపంలో ఎదుట నిలిస్తే ఆ అయిదేళ్ళ బాబును చూసి హడలిపోయింది వాసంతి. 'తన వైవాహిక జీవిత లతను అల్లల్లాడించే పెనుగాలి' అనుకొంది.

◆ ◆ ◆

బాబుతో మొదటి పరిచయంలోనే వ్యగ్రత పొందింది వాసంతి. అది వాసంతి ఉద్యోగంలో చేరిన మూడవ రోజు. క్లాసులో కాలు పెట్టగానే పిల్లలంతా లేచి "నమస్కారం టీచర్" అన్నారు ముక్తకంఠంతో. అందరికన్నా వెనుకగా మూల బెంచిలో కూర్చున్న బాబు లేవలేదు. నిర్లక్ష్యంగా ఇంటి కప్పును పరీక్షిస్తున్నాడు. ఆ పిల్లడి నిర్లక్ష్యం వాసంతి చూపును అటు తిప్పింది.

"నీ పేరేమిటి అబ్బాయి?" అంది శాంతంగా.

"బాబండి, టీచరు.... బాబు" అన్నారు కొందరు పిల్లలు గోలగా. బాబు మాట్లాడలేదు, కదలలేదు.

"చూడు బాబూ. నువ్వు యిలా వచ్చి, ఇక్కడ ముందు బెంచిలో కూర్చో" అన్నది వాసంతి.

మొదటి చూపులోనే క్లాసులోని పిల్లలందరిలో బాబు ప్రత్యేక మనస్తత్వం గలవాడని వాసంతి తెలుసుకొంది. చిన్నపిల్లలను అదిలించి బెదిరించి దారికి తేవడం అంత మంచిది కాదని, వారిని మంచి మాటలతో, తన ప్రేమానురాగాలతో మంచి మార్గాన నడిచేలా చేయాలని వాసంతి అభిప్రాయం.

ఒక నిమిషం వాసంతిని తేరిజూచి తన సంచిని భుజాన తగిలించుకొని ముందుకు వచ్చాడు బాబు. పిల్లలంతా తాము ఇళ్ళదగ్గర వ్రాసుకు వచ్చిన గుణింతం, ఎక్కాలు చూపిస్తున్నారు.

"బాబూ, నీ పలక తే. రెండో ఎక్కం వచ్చిందా?" అని ప్రశ్నించింది వాసంతి. బాబు ఉలకలేదు, పలకలేదు. శిలా ప్రతిమలా చేతిలో పలక పట్టుకొని నిల్చున్నాడు.

"ఎక్కం రాదా బాబూ?"

– – –

"వ్రాయడం మరచిపోయావా?"

– – –

"పిల్లలెవరయినా చెరిపేశారా?"

– – –

"రేపు వ్రాసుకు వస్తావా?"

కథా నిలయం
6422
శ్రీకాకుళం

నెమ్మదిగా తల ఊపి కూర్చున్నాడు బాబు. ఆ పూటంతా ఎంత ప్రయత్నించినా బాబు చేత ఒక్కమాట పలికించలేకపోయింది వాసంతి.

◆ ◆ ◆

మరునాడు బాబు వెనుక బెంచీలోనే కూర్చున్నాడు.

"నిన్ను ఇక్కడ ముందు బెంచీలో కూర్చోమని చెప్పలేదా?" అన్నది వాసంతి.

"అహ... నిన్న ఒక్కరోజుకే అనుకొన్నాను" అన్నాడు బాబు నిర్లక్ష్యంగా తల ఎగురవేస్తూ.

ముందు రోజు వాసంతి ఎంత ప్రయత్నించినా బాబు నోట ఒక్క మాట వెలికి రాలేదు. ఈనాడు తనంతట తానే మాట్లాడటంతో సంతోషించింది వాసంతి.

"నిన్న చెప్పిన ఎక్కం వ్రాసుకొచ్చావా?" ప్రశ్నించింది.

"లేదు."

"ఏం?"

"రాయలేదు."

"అదే, ఎందుకు వ్రాయలేదనే అడుగుతున్నాను. ఎక్కం రాలేదా?"

"వచ్చండి....బాబుకు రెండో ఎక్కం అంతా వచ్చు" అన్నారు పిల్లలు.

"మరి ఎందుకు వ్రాయలేదు బాబూ."

"నా ఇష్టం. నే రాస్తే రాస్తాను, లేకుంటే లేదు. నీకెందుకు?" అన్నాడు బాబు పెంకెగా.

"తప్పు బాబూ! టీచర్ని అలా అనవచ్చా? అందరు పిల్లలు చూడు. ఎంచక్కా వ్రాసుకువచ్చారో? వాళ్ళంతా ఎంతో మంచి పిల్లలు. నువ్వో చెడ్డ పిల్లవాడివి.... అవునా, కాదా? నిన్న ఎక్కం వ్రాసుకొస్తానని, ఈరోజు వ్రాయలేదు" అన్నది వాసంతి లాలనగా.

"రాస్తానని ఎవరు చెప్పారేం? నేను బుజ్జగిస్తే రాస్తాననుకొన్నావు... హి....హి....హి.... అంతే కావాలి... అంతే" అని నవ్వసాగాడు.

వాసంతిలో ఓర్పు సన్నగిల్లింది. ఈ కుర్రాడు కావాలనే తన్ను చికాకు పెడుతున్నాడు అనుకొంది. "బాబూ, ఏమిటా నవ్వు అసహ్యంగా? నోరు మూసుక్కూర్చో" అంది కోపంగా.

"నువ్వే అసహ్యంగా ఉన్నావు. థూ!" అన్నాడు బాబు ఉమ్మి తుంపరలు చిందిస్తూ.

ఒకటి రెండు తుంపరలు వాసంతి ముఖంపై పడ్డాయి. "ఏతల్లి పెంపకంరా భగవంతుడా! ఇంత పాడుకుర్రాడూ" అంటూ చేయెత్తి ఒక లెంపకాయ తగిలించింది.

ఆ కోపంలో ఆమె వివేకాన్ని కోల్పోయింది. తాను ఏది చెడు అని తలచిందో దానినే తనచే చేయించింది క్రోధం. అరిషడ్వర్గాలలో అందుకే దానికి ప్రముఖ స్థానం ఇచ్చారు. క్రోధాన్ని జయించందే సంకల్పసిద్ధి లభించదని, మహాత్ములెందరో చెపుతుంటారు అనుకొంది వాసంతి.

"బోల్తా. టీచరు బోల్తాపడింది. నాకు అమ్మలేదు. నేను అమ్మని తినేశా" అన్నాడు బాబు గర్వంగా.

"అవునండి టీచరు. వీడమ్మ వీడు పుట్టగానే చచ్చిపోయిందట. అమ్మని తినేసి పుట్టాడని మా అమ్మకూడ అన్నది" అన్నాడు పక్క పిల్లాడు బాబును బలపరుస్తూ.

వాసంతి చెయ్యి ఆగిపోయింది. మనసు భారంగా మూలిగింది. పిల్లలు మనస్తత్వాలు అంటూ అంత లెక్చర్లిస్తావే... నీ సహనం ఏమయింది? ఏదో పెంకెగా సమాధానం చెప్పాడని తల్లిలేని పిల్లడిని పట్టుకుకొడతావా? ఇదే నీ పిల్లాడయితే అంత దెబ్బ వెయ్యగలవా? పెడదారిన పడిన పిల్లలను బాగుపరచే మార్గం ఇదేనా?" అని మనసు నిలదీసింది.

బాబుతో గడిపిన ఆ కొద్ది కాలంలోను ఆ కుర్రాడి మనస్తత్వం తెలుసు కోవాలని ఎంతగానో ప్రయత్నించింది. కోపంకాని, భయంకాని, ప్రేమ కాని ఏదికూడా ఆ కుర్రాడి మనస్సును మార్చలేకపోయింది. భయం, భక్తి, నమ్రత అన్న పదజాలం అతని నిఘంటువులో అంతరించిపోయింది.

నోటికి వచ్చిన మాట, చేతికి దొరికిన పని చెయ్యడంలో ఏమీ సంకో చించడు. పిల్లలందరితోనూ తగవులే. ఏ విషయంలోను ఆసక్తి చూపక, మంచి చెడ్డ అన్న భేదం లేక గాలి ఎటు వీచితే అటు ఎగిరిపోయే ఎండుటాకులా తిరిగేవాడు బాబు. అతన్ని ఆదరించి ఆపగలిగే చనువు ఎవరికీ ఇచ్చేవాడు కాదు. కోపగిస్తే రెచ్చిపోయేవాడు. నెమ్మదిగా చెప్తే మౌనం దాల్చేవాడు. చేసేది మాత్రం తనకు తోచినట్లే.

ఆ బాబుకు ఈనాడు తను సవతితల్లి స్థానంలో నిల్చేసరికి, తన్ను తాను సర్దుకోలేక పోయింది వాసంతి. వివాహానికి ముందుగా పిల్లాడిని గురించి తెలుసుకోనందుకు తనను తాను నిందించుకొంది. ఏది ఏమయినా ఈ క్లిష్ట బాధ్యతను నిర్వర్తించగల తాహతునివ్వమని భగవంతుని ప్రార్థించింది.

తండ్రి వివాహం పిల్లలు చూడకూడదనే ఆచారం మూలంగా బాబు అప్పటివరకు తన పిన్నిని చూడలేదు. వారం రోజులై ఇంట్లో అంతా నీకు పిన్ని వస్తుందిరా, పిన్ని అంటే, ఇంకా ఎవరో అనుకొన్నాడు. అస్తమానం అన్నిటికి అది తప్పు, ఇది తప్పు అనే ఆ టీచరే తన పిన్ని అని తెలియగానే ఆ లేత హృదయం దెబ్బతిన్నది. కళ్ళనీళ్ళతో గిరుక్కున వెనుదిరిగి వచ్చినట్లే పరుగుతీశాడు.

◆ ◆ ◆

వాసంతి అత్తవారింటికి వచ్చి వారంరోజులయింది. వచ్చిన బంధువు లంతా వెళ్ళిపోవడంతో ఇల్లంతా వెలితిగా వుంది. ఇంట్లో వుండేది అత్తగారు, తను, భర్త, బాబు మాత్రమే. అత్తగారికి మడి తడి, ఆచారం, ఎంతసేపూ ఆ పడమటిల్లు వదిలిరాదు. రాజశేఖరం ఉదయమనగా ఆఫీసుకు వెళితే, సాయంకాలం ఆరింటికి కాని తిరిగి రాడు.

ఇంక మిగిలింది తను, బాబు. బాబుతో స్నేహం కలుపుకోవాలని, అతని ఆత్మీయతను సంపాదించాలని ఈ వారం రోజులలో చాలాసార్లు ప్రయత్నించింది. కాని అతని విముఖత తగ్గలేదు.

తనను చూడగానే, ఏదో చూడరాని వస్తువును చూసినట్లు ముఖం చిట్లించుకొని వెళ్ళిపోతాడు. బంధువులందరిమధ్య అంతకన్న ఎక్కువ శ్రద్ధ చూపితే అపహాస్యం పాలవుతానని ఊరుకొన్నది వాసంతి.

నిద్రలేచి పెరట్లోకి వచ్చేసరికి అత్తగారి గొంతుక వినిపిస్తున్నది. "అయ్యో నాయనా! పెళ్ళాం యింట్లో కాలుపెట్టగానే, కన్నకొడుకు విషమయి పోయేడురా! పసివాణ్ణి పట్టుకొని అలా కొట్టుకుంటారా ఎవరైనా?" అంటూ శోకాలు పెడుతున్నది అత్తగారు రామాయమ్మ.

బాబు ఒళ్లో ఇంత కచ్చిక పోసుకుని కూర్చున్నాడు. కళ్ళలో నీళ్ళు లేకున్నా, ముఖం మాత్రం కోపంతో జేగురించివుంది. నాయనమ్మ తనను వెనకేసుకు రావడం చూసి, "ఫో. నా ఇష్టం" అన్నాడు బాబు కోపంగా తండ్రితో.

"ఏమిటిరా వెధవా నీ ఇష్టం? ఇంకోమాటు అను.... దవడ పగులుతుంది. ఇష్టంట.... ఇష్టం...." రాజశేఖరం కోపం మిన్నుముట్టింది.

"ఏం, అంటాను. నా ఇష్టం వస్తే అంటాను" అంటున్నాడు బాబు రెట్టించి.

చాచి లెంపకాయి కొట్టబోయిన రాజశేఖరం చేతిని వెనుకనుండే పట్టుకొన్నది వాసంతి. చాలు. మహా ఘనకార్యం చేయబోతున్నారు కాని, ఇంట్లోకి వెళ్ళి మీపని చూసుకోండి అన్నట్లున్నాయి ఆమె చూపులు.

నవ వధువు వాసంతి ముందు తను అలా మోటుగా ప్రవర్తించినందుకు సిగ్గుపడి మారుమాటలేకుండా వెళ్ళిపోయాడు రాజశేఖరం.

"ఆయన శిక్ష అయింది. ఇంక ఈవిడిది మిగిలింది లాగుంది" అంటూ వంట ఇంట్లోంచి గొణుగుతున్నది రామాయమ్మ.

వాసంతి శాంతంగా "బాబూ" అన్నది.

బాబు పలకలేదు. నెమ్మదిగా చెయ్యి పుచ్చుకొని లేపబోయింది వాసంతి. రెండు చేతులలో వున్న బూడిద వాసంతి తలపై రిమ్మి "ఫో, దెయ్యం. నేను రాను" అన్నాడు బాబు.

కొత్తగా వచ్చిన ఈ పిన్ని ముందు నాన్న తనను తిట్టాడు. పిన్ని తనను చూసి నవ్వింది. బాబు హృదయం అవమానంతో ఉడికిపోతున్నది.

వంట ఇంటి కిటికీలోంచి ఈ దృశ్యం చూసిన రామాయమ్మ రెచ్చిపోయింది. తన మనుమడి దుండగానికి ఈ కోడలుపిల్ల ఎంత హంగామా చేస్తుందో అనుకొంది.

వాసంతి మారు పలుకలేదు. ఎందుకిలా చేశావని బాబును దండించలేదు. తలమీద బూడిద దులుపుకొంటూ, తిన్నగా నూతి దగ్గరకుపోయింది. రెండు మూడు బాల్చీల

నీళ్ళు తోడుకు పోసుకుంది. ఆ స్నానంతో తలపై పడిన బూడిద పోయినా, బూడిద కళ్ళలో కూడా పడడంతో కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా అయ్యాయి. తడిబట్టను పిండి కట్టుకొని ఇంట్లోకి వచ్చింది.

శీతాకాలం ఆఖరిదశలో ఉన్నా, ఇంకా చలి ఉన్నానంటున్నది. బాబు తన దంతధావన కార్యక్రమం పూర్తిచేసి వాకిట్లో ముఖం తుడుచుకొంటున్నాడు. తడిబట్టతో వణుకుతూ ఇంట్లోకి వస్తున్న వాసంతిని చూశాడు. చేతిలో ఉన్న తువ్వాలు అందిస్తూ "తుడుచుకో..... లేకుంటే ఊష్ణం వస్తుంది. నాకేం? నువ్వే చేదుమందులు తాగాలి" అన్నాడు నాయనమ్మ అనే మాటలను అనుకరిస్తూ.

"ఊష్ణం వస్తే రానీ. నా ఇష్టం, నేను తుడుచుకోను" అన్నది వాసంతి. నా ఇష్టం అన్న పదాన్ని బాబు పలికినట్లే పలుకుతూ.

నిజానికి చలి వేస్తున్నా బాబుపై. ఈ సంఘటన ఎలా పనిచేస్తుందో చూడాలని, అలా నీళ్ళు కారుతున్న జుట్టుతోనే ఉండిపోయింది.

బాబు స్కూలుకు వెళ్ళేదాకా, రెండు మూడు సార్లు వాసంతి జుట్టు వంక, కళ్ళవంకా చూసి ఏదో చెప్పబోయి మళ్ళా ఊరుకొన్నాడు.

'నాకేం... జబ్బుచేస్తే తనే చస్తుంది' అని తనలో తనే చెప్పుకొన్నాడు.

స్కూలులో వున్నంతసేపు, ఈపాటికి పిన్నికి ఊష్ణం వచ్చి వుంటుంది. డాక్టరుగారు చేదుమందు తాగమంటే, ఏడుస్తూ వుంటుంది... మరి అంతే కావాలి. పొద్దున్న నన్ను చూసి ఎందుకు నవ్వాలి... అందుకే... అంతేకావాలి అంటూ సంతోషపడ్డాడు.

సాయంకాలం ఇంటికి వస్తూనే పిన్ని గదిలోకి పరుగులు తీశాడు. అద్దం ముందు కూర్చుని జడ వేసుకొంటున్న పిన్ని ఎంతో అందంగా కనిపించింది. పిన్నికి ఊష్ణం రాలేదు. అయినా బాబు విచారించలేదు. మంచిదే అయింది. లేకపోతే, నీనుంచే పిన్నికి ఊష్ణం వచ్చిందని నాన్న నన్ను తిడతాడు అనుకొన్నాడు బాబు.

◆ ◆ ◆

కాలం గడుస్తున్నకొద్దీ బాబులో ఉన్న ఈ ద్వంద్వ ప్రవృత్తులు ప్రస్ఫుటం కాసాగాయి. స్వతహాగా బాబు పెంకెవాడు కాదు కాని, కావాలని పట్టుదలతో అలా మొండిగా ప్రవర్తిస్తున్నాడని తెలుసుకొన్నది వాసంతి.

పసిపిల్లలపట్ల అతి గారాబం కాని, అతి భయం కాని చూపడం మంచిది కాదు. గారాబం వలన క్రమశిక్షణ లోపించి, పిల్లలు అనారోగ్యకరమైన అలవాట్లకు లోనవుతారు. అదేవిధంగా తలిదండ్రులవద్ద అమిత భయం కలిగి వుంటే తమ మనోగత వాంఛలను వారిముందుంచలేక వాటిని తీర్చుకొనే మార్గం తెలియక సతమతమవుతారు. తమను, తమ అవసరాలను తలిదండ్రులు సరిగా గమనించలేదనే భావన వారి మనస్సులలో

ప్రవేశించి, ఒక విధమైన తెగింపు వారిలో కలుగుతుంది. దానినే ఇంకొకవిధంగా చెప్పాలంటే మొండితనం, పెంకెతనం అనవచ్చు.

ఈ రెండు పొరపాట్లు, బాబు పెంపకంలో జరిగేందుకు ఏ అవరోధం కలుగలేదు. భార్య మరణంతో విరక్తి చెందిన రాజశేఖరానికి ఆ మరణానికి పరోక్షంగా కారకుడని తలచిన కొడుకుపై అభిమానం చిగురించలేదు. చీటికి మాటికి అర్ధరహితంగా రోదించే పసిపాపలను లాలించి బుజ్జగించే ఓర్పు, నేర్పు మాతృమూర్తికి భగవద్దత్తమైన వరం. దానికి ఏవిధంగానూ పురుషులు అర్హులు కారని చాటి చెప్పుకొన్నాడు రాజశేఖరం. ఇంటికివస్తే ఆ పసివాని రోదన వినవలసి వస్తుందని రాత్రి పగలు యిల్లు పట్టకుండా తిరిగిన రోజులు అనేకం.

కోడలి మరణంతోను, కొడుకు విరక్తితోను వెతజెందుతున్న ఆ వృద్ధనారి హృదయంలో పదిరోజుల ఆ పసివాడు ఆశాజ్యోతి అయ్యాడు. ఆ పిల్లడి పాలన, పోషణలోనే కాలం వెళ్ళబుచ్చుతూ అతని ప్రతి చిన్న కోరిక తీర్చడమే తన ధ్యేయంగా పెట్టుకొని సంచరించేది రామాయమ్మ.

ఇటువంటి వ్యక్తుల మధ్య పెరిగిన బాబుకు కోపం, పెంకెతనం అబ్బడంలో ఆశ్చర్యపడవలసిన విషయం లేదు. కొత్త వదినగారిని చూసి పోదామని వచ్చింది పెద్దాడబడుచు వసుంధర. వసుంధర భర్త పేరుమోసిన వకీలు. అత్తవారిది పెద్ద కుటుంబం అయినా, పిత్రార్జితమైన ఆస్తిపాస్తులతో, తాము తింటూ ఒకరికి పెట్టగల తాహతు గలవారు. అన్న, వదినల పెట్టుపోతలకు ఆశించవలసిన అవసరం వసుంధరకు లేదు. అయినా చదువుకొన్న ఈ కొత్త వదినగారు ఎలా వుంటుందో అన్న కుతూహలమే ఆమె రాకకు కారణం. పెద్దపిల్లలనిద్దరిని అత్తింట వదిలి, చంటిపాప అనూరాధను మాత్రం తీసుకువచ్చింది వసుంధర.

మొదటి రెండు రోజులు అత్త పాపతో ఆడుకొంటూ, సంతోషంగా గడిపాడు బాబు. అప్పటిలో బాబు పట్టు పంతాల గురించి ఎవరు చెప్పినా, వినేవారికి ఆశ్చర్యంగానే వుంటుంది. 'ఇంతుంటే... ఇంత... ఎంతయినా సవతితల్లి కాదా?' అనుకొన్నది వసుంధర.

అంత ప్రశాంత వాతావరణం ఒక్కసారిగా చెదిరిపోయింది. వసుంధర పెట్టెలో నుండి రెండు బిస్కెట్లు తీసి బాబు కిచ్చింది. ఇంకొకటి తీస్తుంటే బాబు తీక్షణంగా చూస్తున్నాడు.

"అదెవరికి అత్తా?" అని ప్రశ్నించాడు, ఇక ఊరుకోలేక.

"అనూ పాపకిరా" అన్నది వసుంధర.

"ఉహూ, పాపకి వద్దు. నాక్కావాలి" అన్నాడు. ఆశకొద్దీ అని ఉంటాడని దానిని బాబు చేతిలో పెట్టి ఇంకొకటి తియ్యబోయింది.

"పాపకి వద్దత్తా" అన్నాడు బాబు కోపంగా.

"ఏరా, పాప తనకి వద్దని నీతో చెప్పిందా?" నవ్వుతూ ప్రశ్నించింది వసుంధర.

"పాపకివ్వొద్దు. పాప నన్ను కొట్టింది" అన్నాడు బాబు బుంగ మూతితో.

"నువ్వు మరి పాపని గిల్లలా?"

"గిల్లితే?"

"అది కొట్టింది. నిన్నెవరయినా గిల్లితే నువ్వూరుకొంటావా?"

"ఊహూ... ఇలా తంతాను" అని కాలు ఎగరవేశాడు బాబు. ప్రమాద వశాన ఆ కాలు వసుంధర పక్కలో తగిలింది. మంచి ఊపులో తగిలిందేమో, వసుంధర బాధతో "అమ్మా" అంది.

పక్కనే ఆడుకొంటున్న అనూ "మా అమ్మని ఎందుకలా తన్నావు?" అంటూ బాబుపై కలియబడింది.

అప్పటివరకు ఏమి జరిగిందో తెలియక ఆశ్చర్యంతో చూస్తున్న బాబు అనూ జుట్టుపట్టుకొని నడ్డివంచి నాలుగు గుద్దులు గుద్దాడు.

అప్పుడే గదిలో కాలుపెట్టిన వాసంతి నివ్వెరపోయింది. బాధతో వదిన లుంగచుట్టుకొని నేల కరుచుకుపోయింది. అనూరాధ పంచమస్థాయిలో రాగాలాపన చేస్తున్నది. బాబు రెండు చేతులు నడ్డిపై పెట్టి మల్లయుద్ధంలో జయించిన యోధుడిలా చూస్తున్నాడు అనూరాధవైపు.

"బాబూ, ఏం చేశావు పాపని?" వాసంతి గదమాయించింది.

"కొట్టాను..... పాప మొదట నన్ను కొట్టింది" అన్నాడు నిబ్బరంగా.

"చంటిదాన్ని చావబాదాడు వెధవ, నా డొక్కలో పొడిచింది చాలక. ఏం పెంపకం పెంచుతున్నారమ్మా. చిన్నా, పెద్దా జ్ఞానం ఉండక్కరలా?" అంది వసుంధర విసురుగా.

అంతవరకు తన మేనల్లుడు అతి బుద్ధిమంతుడు అని మురిసిపోయిన అత్తకు, తనదాకా వస్తే తెలిసివచ్చింది.

"మా అమ్మ చేతిలో పెరిగిన వాళ్ళంతా ఇంతే. చిన్నప్పుడు ఆ రాజిగాడికి మాత్రం పట్టపగ్గాలుండేవా? పోలికలు ఎక్కడికి పోతాయి?" అంది ఉక్రోషంగా.

"మరేం... రక్త సంబంధికుల పోలికలు పిల్లలకి రాకేం చేస్తాయి? అంది వాసంతి. ఈ కోపతాపాలలో మీపాలు ఉండనే వుంది అనేలా.

"మాకూ, మా పిల్లలకూ ఇలాటి ఒంటెత్తు బుద్దులు లేవు. పాపకు బిస్కెట్టు ఇచ్చానని డొక్కలో తన్నాడు" అంది వసుంధర.

"నిన్ను తన్నాలని తన్నలేదు అత్తా. ఇలా తంతానని చూపిస్తుంటే తగిలింది" అన్నాడు బాబు తన దోషం లేదన్నట్లు.

"అక్కయ్య పోయాక బాబును మీ దగ్గరికి తీసుకుపోయి ఉండవలసింది" అంది వాసంతి.

"మరేం.... నా పిల్లలు నాకు చాలరని. తండ్రి వున్నాడు. నాయనమ్మ వుంది. ఎవరి బాధ వాళ్ళు పడాలి కాని....."

"అంతా అలా అనుకుంటే తల్లిలేని పిల్లలు పెరిగేదెలా?"

"నీకూ పిల్లలు పుట్టుకు రానీ తెలుస్తుంది ఈ ఉదారత. ఇప్పుడేం మించి పోయింది లేదు. సరిదిద్ది ఎలా తయారుచేస్తావో చూడనా?" రెట్టించింది ఆడపడుచు.

"ఒకరిని బాగుపరచడం, మానడం అన్నది మన చేతులలో వున్న పనికాదు. అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలి కదా? ఒక తల్లి కడుపున పుట్టి, ఒక గృహంలో పెరిగిన పిల్లలు అనేక తరహాలుగా తయారవు తారు. అందులో ఉత్తములుగా తయారయిన వారిని చూచి ఆ తల్లిని అభినందించడం కాని, చెడిపోయిన వారిని గూర్చి ఆమెను నిందించడం కాని అవివేకం. మనుష్యుల మంచి చెడ్డలకు వారి మనస్తత్వాలు చాలవరకు కారణం అవుతాయి. మంచి మనస్తత్వం లభ్యమయ్యే వాతావరణం కల్పించడం వరకే మనం చెయ్యగలిగేది. కొందరికి ఒక పనిలో వున్న మంచి కొట్ట వచ్చినట్లు కన్పిస్తుంది. మరి కొందరికి అదే పనిలో అట్టడుగున ఉన్న అణుమాత్ర దోషమే పెనుభూతంలా కనిపిస్తుంది. అది జరిగిన పనిలోగాక, ఆ పనిని తిలకించిన మనుష్యుల మనోభావాలని బట్టి ఉంటుంది.

"అంతమాత్రాన పిల్లలు గాలికి పుట్టి, ధూళికి పెరుగుతారని నే నన లేదు. పిల్లల మంచి చెడ్డలలో తలిదండ్రుల బాధ్యత, ముఖ్యంగా చిన్నతనంలో విధిగా వుంటుంది. దానికి తోడు స్వతస్సిద్ధమయిన మంచి హృదయం పిల్లలలో కూడ ఉండాలంటాను.

ఒక్క తల్లిదండ్రుల పెంపకంతోనే పిల్లల మనస్తత్వాలు మలచబడితే, ఒక కుటుంబంలోని పిల్లలంతా ఒకే మూసలో బోసిన బొమ్మల్లా తయారయి వుందురు. కాని, మన కళ్ళ ముందున్న భిన్న భిన్న ప్రవృత్తుల మనుష్యులను చూస్తున్న మనం ఈ సత్యాన్ని కాదనలేము.

"ఇదంతా వాదనకోసం అంటున్నది కాదు వదినా, మీ తమ్ముడిగారితో వివాహానికి పూర్వమే బాబుతో నాకు పరిచయమయింది. మొదటి పరిచయం లోనే, ఆ పసివానిలో కొన్ని గుణాలు లోపించాయని నేను గ్రహించాను. అవి అతనిలో నిద్రితమయి వున్నాయి. వాటిని ఏవిధంగానయినా మేల్కొల్పగలిగితే అతడు ఉత్తమ మానవుడుగా తయారవుతాడు. ఆ నిద్రాణశక్తులను ఏ విధంగా మేల్కొల్పగలనా అన్నదే నా ఆలోచన. దండనవల్ల అవి అధోగతం కావడం తప్ప ఫలితం ఉండదు.

"ఏదో ఒక విధాన బాబు బాగుపడతాడు. ఆ నమ్మకం నాకుంది. నా భర్త బిడ్డడుగా కాకున్నా ఒక మాతృహీనుడిగానైనా బాబుని తీర్చిదిద్దవలసిన బాధ్యత నాకుంది. నా శాయశక్తులా అందుకు ప్రయత్నిస్తాను అన్నది వాసంతి దృఢసంకల్పంతో.

వసుంధరలోని స్త్రీ హృదయం పులకించింది. 'ఈ మంచిబుద్ధులు ఈమెలో శాశ్వతమయేలా అనుగ్రహించు భగవాన్' అనుకొంది తృప్తిగా.

◆ ◆ ◆

కొంతకాలంగా బాబులో కనిపిస్తున్న అభివృద్ధి వసుంధర వెళ్ళిన దగ్గరి నుంచి కుంటుపడింది. ఇంటి దగ్గర, స్కూలులోను కూడ పెంకెతనం, పట్టుదల జాస్తి కాజొచ్చాయి. అతిసహనంతో ఆ పసివాణ్ని తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్న వాసంతికి సహితం కోపం తెప్పించేవిగా ఉన్నాయి బాబు చర్యలు.

ఆనాడు ఆదివారం. ఉదయం పది గంటలయింది. 'సెలవు, సెలవు అనుకోడమేకాని, సెలవునాడు ఏ పని తెమిలి చావదు. ఇంత పొద్దెక్కినా ఆ తండ్రీ కొడుకులు స్నానాల మాటే ఎత్తరు. నీళ్ళు గంటపైగా కాగి చల్లారు తున్నాయి. ఇంక ఇద్దరికి మేలుకొల్పులు పాడక తప్పదు' అనుకొంది వాసంతి.

"ముందు నీ బంగారు తండ్రికి కానీ" అన్నాడు రాజశేఖరం.

"నాకే కాని మీకు కాదా? ఆ బంగారం ఏదో మీ నుంచి అంటిందే వాడికి" అన్నది వాసంతి నవ్వుతూ.

"నా నుంచి అంటిన మంచితనమేమయినా ఉంటే, దానిని దులిపే ప్రయత్నమేగా నువ్వు చేస్తున్నది" అన్నాడు రాజశేఖరం.

"ఆ... మరేం.... అదే పని నాకు. ఈరోజు ప్రొద్దున్న పాలు తాగిపోయిన వాడు ఇంకా రాలేదు. ఎక్కడికి పోయి ఉంటాడు?"

"ఎక్కడికి పోతాడులే? పక్కింటి గోపాలంతో ఆడుతున్నాడులా ఉంది. వాళ్ళ తమ్ముడు పుట్టిన దగ్గరి నుంచి వాడితో జోస్తీ ఎక్కువగా ఉంది"

రాజశేఖరం మాట పూర్తికానేలేదు. వీధి తలుపు చప్పుడైంది. "అదిగో మాటలలోనే వచ్చాడు" అంటూ వాకిట్లోకి వచ్చింది వాసంతి.

వచ్చింది బాబు కాదు. పక్కింటి సుభద్రమ్మ. చంకలో పసికూనతో ఇంత పొద్దున్నే ఈవిడ ఎందుకొచ్చినట్లా అని ఆశ్చర్యపోయింది వాసంతి.

"చూడమ్మా కోడలా. రాలుగాయి పిల్లాడిని ఇలా ఊరుమీద వదిలివేస్తే, మేము సంసారాలతో ఉండాలా, వద్దా? పెద్దవాళ్ళు ఉన్నాక కాస్త భయం చెప్పకపోతే ఎలా? చంటాడికి నీళ్ల పోసి, పాలిచ్చి, ఉయ్యాలలో పెట్టి ఇలా వచ్చానో, లేదో కెవ్వున గుక్క పెట్టాడు. ఏమైందా అని వచ్చి చూస్తే కన్ను రక్తం గడ్డలా ఉంది. మీ బాబు పొడిచాడట. గోపాలం చెప్తున్నాడు" అని ఫిర్యాదు చేసింది ఆవిడ.

తల్లి పక్కనే నక్కి వున్న గోపాలాన్ని "అవునా గోపాలం? బాబు తమ్ముడి కన్ను ఎందుకు పొడిచాడమ్మా?" అని ప్రశ్నించింది వాసంతి.

"మరేమోనండి.... మరేమోనండి. మాకు తమ్ములున్నాలు. నీకు లేలన్నానండి.

"మీ తమ్ములు బాగులేలు. మా తమ్ములు ఇంకా ఎంతో బాగుంతా లన్నాడండి.

"అది తమ్ములు కాదు లబ్బలు బొమ్మ అన్నానండి.

"ఛీ... మీ తమ్ములు మత్తిబొమ్మ అని కన్ను పొలిచాడండి" అన్నాడు బెక్కుతూ.

వాసంతికి ఏమనాలో తోచలేదు. సుభద్రమ్మ రెండు చేతులు పట్టుకొని "చిన్నవాడు.. మీరు మన్నించాలి. వాడిని నేను కేకలేస్తాను. ఇంకెప్పుడు ఇలా జరగదు" అన్నది భారంగా.

"ఏమోనమ్మా... నల్లగా ఉన్నా, తెల్లగా వున్నా ఎవరి పిల్ల వారికి ముద్దు. పసివాడి ప్రాణానికే ముప్పయితే ఎలా? ఇంక మా ఇంటికి పంపబోకు" అంటూ వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

స్వతహాగా బాబు కర్కశ స్వభావుడుకాదు. ఈ పిల్లాడి కన్ను ఎందుకు పొడిచినట్లు? తనకు లేని తమ్ముడు గోపాలానికున్నాడనా? తనది తమ్ముడు కాదు రబ్బరు బొమ్మ అని గోపాలం ఆక్షేపించాడనా? అది బాబు నోటి మీదుగానే వినాలి. వీధి అరుగుమీదికి వచ్చి బాబుకోసం ఇటు, అటు చూసింది.

అరుగు చివర్న రెండు ముడుకుల మధ్య తల ఆనించి కూర్చున్నాడు బాబు. చేసిన పనికి విచారిస్తున్నాడేమో, తను కోప్పడుతుందని భయపడు తున్నాడేమో అనుకొంది వాసంతి.

"బాబూ, లోపలికి రా" అంది.

బాబు పలకలేదు.

"నిన్నే, లోపలికి రా" అంది గట్టిగా.

"నేను రాను. నాన్న కొడతాడు" అన్నాడు నెమ్మదిగా.

"తప్పు చేస్తే కొట్టక ముద్దిస్తారా? గోపాలం తమ్ముడి కన్ను ఎందుకు పొడిచావు? అది తప్పు కాదా?"

"నేను పొడవలేదు... మీ తమ్ముడు బాగులేదు అన్నాను. చూడు ఎంత బాగున్నాడో అని చూపిస్తూంటే గోపాలం వేలు తగిలింది. వాడన్నీ అబద్ధాలు చెప్తాడు" అన్నాడు. నిజాయితీ తన ఒక్కని సొత్తే అయినట్లు.

"వెధవా. నోరు మూసుకు లోపలికి రా. చేసిన పని చాలక ఇంకా దొంగ కబుర్లు చెప్తున్నావు" అంటూ సావిట్లోంచి గద్దించాడు రాజశేఖరం.

బాబు కదలలేదు. లోపలినుంచి విసురుగా వచ్చి రెక్క పుచ్చుకు లాక్కుపోయాడు రాజశేఖరం.

"నెమ్మదిగా నచ్చచెపితే రాకపోయాడా?" అన్నది వాసంతి.

"నెమ్మదిగా నువ్వు పిలిస్తే వచ్చాడు, చూసావుగా? మరీ యింత అలుసిస్తే నీ నెత్తెక్కి తొక్కగలడు. ఆపైన ఏమనీ లాభం వుండదు. ఇంట్లో వాళ్ళ దగ్గర కాస్త భయం, భక్తి ఉండేలా చూడు" అన్నాడు రాజశేఖరం బాబు అవిధేయత కంతా ఆమెదే బాధ్యత అయినట్లు.

"ఈపాటి జ్ఞానం, బాధ్యత మొదటి నుంచి వుంటే బాబిలా తయారయే వాడా? 'నాకేం అక్కరలేదు. వాడు నా శత్రువు, కొడుకు కాదు అని ఆ పసివానిపై పగ సాధిద్దామనుకున్నారు.

"కాదంటే కాకపోయేందుకు ఇదేమయినా బొమ్మలాటా? ఆ పిల్లాడి తల్లిపట్ల మీకు నిజమయిన ప్రేమే వుంటే, ఆమె అనురాగానికి చిహ్నమయిన పసివాణ్ణి నిర్లక్ష్యంగా వదలి ఉండడం ఆమెకి అన్యాయం చెయ్యడమే అవుతుంది" అన్నది వాసంతి.

"అనవసరంగా గడిచిన గాథలను తవ్వి నా మనస్సుకి శాంతి లేకుండా చేస్తున్నావు వాసంతీ. నన్ను బ్రతకనియ్య దలుచుకోలేదా?" అన్నాడు విరక్తిగా.

"వాస్తవిక పరిస్థితుల గుర్తించి ధైర్యంగా బ్రతుకమనే నే చెప్తున్నది. బాబు మీ బిడ్డడు. వాడి మంచి చెడ్డలను మీ పేరు మీదుగానే సంఘం చర్చిస్తుంది. ఫలాని రాజశేఖరంగారి అబ్బాయి ఇలా అంటుంది. దాని నుండి తప్పుకోవడం మీవల్ల అయే పనికాదు. మంచివారయినా, చెడ్డవారయినా పిల్లలు పిల్లలే. వారిని సక్రమంగా పెంచి, పెద్ద చేసేందుకు తలిదండ్రులు చేయవలసినదంతా చేయాలి. ఆపైన బాగుపడడం, చెడిపోవడం వారి అదృష్టంపై ఆధారపడి ఉంది.

"పిల్లలు బాగుపడి పేరు ప్రతిష్ఠలు తెచ్చుకొంటే సంతోషిస్తాము. చెడిపోతే విచారిస్తాము. పిల్లలు చెడ్డవారయినంత మాత్రాన వారిని దూరం చేయలేము. దుష్టాంగాన్ని ఖండించి మిగిలిన శరీరాన్ని కాపాడవచ్చునేమోకాని, అమసర్థుడయిన బిడ్డని కాదని తలిదండ్రులు సుఖించలేరు. ఈ అనుబంధాం గం శరీరం నుంచి వేరుపరిచినా, బాధిస్తూనే ఉంటుంది. ఆ ఖండితాంగానికి మన శరీరంతో సంబంధం పోవడంచేత దానిని సరిచేయగలిగే సామర్థ్యం కోల్పోవడం మినహా ఫలితం ఉండదు. ఇంతకీ నే చెప్పబోయేది....."

రాజశేఖరం దిగ్గునలేచి గదిలోకి వెళ్ళిపోయాడు. మానబారుతున్న గాయాన్ని కెలికి, అతనిని బాధపెట్టే ఉద్దేశం వాసంతికి లేదు. మృత పత్నిని జ్ఞప్తి చేస్తే, ఆమె ప్రతిరూపం అయిన బాబు పట్ల విముఖత్వం తగ్గి, తండ్రిగా తన బాధ్యతను గుర్తిస్తాడేమో అని ఆమె ఆశ.

బాబు పెంకెతనం, పట్టుదల అంత సులువుగా వదిలేవికావు. బాబుపై విముఖత్వం రాజశేఖరానికి తగ్గడం కూడా తేలిక విషయం కాదు. ఈ రెండింటి సమన్వయం మీదనే ఆ గృహ శకట గమనం ఆధారపడి ఉంది. వాసంతికి కావలసింది అదే.

◆ ◆ ◆

నాలుగైదు రోజులై వాసంతి ఒంట్లో అంత బాగుండటం లేదు. పని పాటల్లో ఎప్పటి చురుకు చూపలేకపోతున్నది. రోజూ ఉదయం బాబుకు నీళ్ళుపోసి, బట్టలు తొడిగి, పుస్తకాల సంచి చేతికిచ్చి, స్కూలుకు పంపడం అలవాటు. ఒక్కరోజు ఆమె చూడకపోతే, దొరికిన పుస్తకాలందుకొని "నానమ్మా, బడికి వేళయింది పోతున్నా" అంటూ పరుగు తీస్తాడు. వల్లమాలిన ముద్దు చేయడమేగాని, పిల్లాడు స్నానం చేశాడా, బట్టలు మార్చుకొన్నాడా అని చూసే ఓపిక ఆవిడకు లేదు.

వాడు వీధి మలుపు తిరిగిపోతూంటే "అయ్యో, పాలు తాగకుండా పోతున్నావురా బాబూ... ఇలా వచ్చి ఈ ఒక్క గుక్క తాగిపో" అంటూ పిలుస్తుంది. ఆ పిలుపు బాబుదాకా అందితే కదా వాడు వచ్చేందుకు?

రెండు రోజులుగా బాబు జోళ్ళు పాలిష్ చెయ్యలేదు. అంతకు ముందురోజు సాయంకాలం ఆటలాడి వచ్చాడు. జోళ్ళు మట్టి కొట్టుకొని చూడలేకుండా వున్నాయి. నెమ్మదిగా బ్రష్, పాలిష్ పట్టుకొని వచ్చింది వాసంతి.

గదిలో దృశ్యం చూసి ఆశ్చర్యపోయింది. బాబు జోళ్ళకు అంతకు ముందు రోజున్న మట్టి రంగు పోయి నల్లగా ఉన్నాయి. నేల మీద ఇంత మసిబొగ్గు గుండ పడి ఉన్నది. అతకు పూర్వమే తొడుక్కొన్న తెల్లని లాల్చీమీద మసి మరకలు కనిపిస్తున్నాయి. అందీ అందని అద్దం ముందు జుట్టుతో కుస్తీలు పడుతున్నాడు బాబు.

"బాబూ, స్నానం చేశావా? ఎవరు చేయించారు?" అన్నది వాసంతి.

"నానమ్మ నీళ్ళుపోసి చొక్కా, నిక్కరు తొడిగింది. చూడు పిన్నీ, నేనే జోళ్ళకి రంగు వేసాను. బాగున్నాయికదూ. నాకు క్రాపింగు దువ్వుకోడం కూడా వచ్చు" అన్నాడు బాబు గర్వంగా.

వాసంతి ఇరుకున పడింది. ఆ మసిమరకల లాల్చీతోను, ఆ జోళ్ళతోను స్కూలుకు పంపలేదు. అతడు చేసిన పనిని తిరిగి తను చేస్తే ఆ పసి హృదయం గాయపడుతుంది. ఏమీచెయ్యా పాలుపోలేదు అంతకు ముందు రోజునే రాజశేఖరం షర్టుకోసం బట్టతెచ్చుకున్నాడు. వాసంతికి మెరుపులా ఒక ఆలోచన తోచింది. బీరువాలోని గుడ్డను తీసి "చూడు బాబూ! నీకు లాల్చీలకు బట్ట తెచ్చాను. మరి ఆ లాల్చీ కొలతకి కావాలి. అది విప్పి ఈ జీరల లాల్చీ తొడుక్కో" అన్నది. కొత్త బట్టలు రానున్నాయన్న సంతోషంతో బాబు ఆమె మాటను కాదనలేదు.

లాల్చీ తొడుక్కొని జోళ్ళు తెచ్చాడు పిన్ని ముందుకు, చేతినిండా మసి అంటుకుంది. ఏమీ ఎరగనట్లే ఎదురుగుండా ఉన్న తువ్వాలుతో ముఖం, చేతులు తుడిచింది వాసంతి.

"చక్కగా తెల్లనిక్కరు. జీరల లాల్చీ, ఆ కేన్వాసు జోళ్ళు వేసుకొంటే ఎంతో బాగుంటుంది. రాజాలా వుంటావు. నిన్న వాళ్ళ గోపాలం కేన్వాసు జోళ్ళ కోసం ఏడిస్తే వాళ్ళమ్మ కొనలేదు.

అంచక్కా నీకే ఉన్నాయి" అంది, కేన్వాసు జోళ్ళు ఉండే అదృష్టం బహుకొద్ది మందికే ఉంటుందన్నట్లు.

ఆ మాటలో తొడుక్కో అనే ఆజ్ఞలేదు, తొడుక్కుంటే బాగుంటాయనే సూచన మాత్రమే ఉంది. అందులోను గోపాలానికి లేని జోళ్ళు నువ్వు తొడుక్కుంటే ఎంతో గొప్పగా ఉంటుందనే మరో అభిప్రాయం.

ఈ మంత్రం బాబుపై బాగా పనిచేసింది. "నాకు తెల్లజోళ్ళు తొడిగేయి పిన్నీ! బడికి వేళయి పోతున్నది" అన్నాడు బాబు తొందరగా.

బాబులో వచ్చిన ఈ పాటి మార్పుకు వాసంతి చాలా సంతోషించింది. ఒడినిండా కచ్చిక పోసుకొని, పళ్లు తోముకునే బాబుకు, జోళ్ళు బుగ్గిగా ఉంటే బాగుండవు అన్న ఆలోచనరావడం చాల గొప్ప విషయమే. తను కావాలని తొడుక్కున్న లాల్చీ విప్పి ఇంకొకరు చెప్పింది తొడుక్కోవడం కూడ అంతకు తక్కువయినది కాదు.

ఈ మాటనే అత్తగారితోను, భర్తతోను చెప్పింది.

"అదేనే అమ్మాయి! మసిగుండ ఎందుకురా అంటే, "జోళ్ళకి రంగు రాస్తాను, బుగ్గిగా ఉంటే బాగుండవంటుంది పిన్ని అన్నాడు. నే నేమయినా అంటే, ఆ బుద్ధి కాస్తా ఎగిరి పోతుందేమో, నువ్వే చూస్తావని ఊరుకొన్నాను" అన్నది రామాయమ్మ.

"పోనీ, ఇంట్లో ఒకరి మాటమీదనయినా గురి ఉంటే అంతే చాలు" అన్నాడు రాజశేఖరం.

◆ ◆ ◆

"నువ్వు మరీ ఇల్లు పట్టకుండా ఆఫీసులోనే అఘోరిస్తే ఎలారా అబ్బాయి? అమ్మాయికి మొన్నటినుంచీ కొంచెం జ్వరం తగులుతున్నది. కాస్త మందో మాకో చూడాలా, వద్దా? అలా వచ్చేటప్పుడు అనంతయ్యగారితో చెప్పి రాలేకపోయావా? చూసిపోయేవారు" అన్నది రామాయమ్మ.

"ఉదయం అలానే అనుకొన్నానమ్మా. తీరా ఆఫీసుకు పోయాక వాసంతి జ్వరం విషయమే మరిచిపోయాను. ఇంక ఇప్పుడు వెళ్లినా ఆయన దొరకరు. రేపు చూడవలసిందే. ఈ రోజు వంట్లో ఎలా ఉంది వాసంతీ" అంటూ గదిలోకి వచ్చాడు రాజశేఖరం.

"మరేం కంగారు పడేందుకు లేదండీ. ఇప్పుడందరికీ వస్తున్నవేగా ఈ జ్వరాలు. రేపటికి అదే తగ్గిపోతుంది" అన్నది వాసంతి.

"వీధి తలుపు చప్పుడవుతున్నది. బాబు వచ్చాడులా ఉంది. చూస్తావా అమ్మా" అన్నాడు అప్పుడే వాలు కుర్చీలో నడుం వాల్చిన రాజశేఖరం.

"అయ్యో బాబుగారా, రండి....రండి. మీ మాటే అనుకొంటున్నాము. చూడు రాజా... డాక్టరుగారు వచ్చారు" అంది రామాయమ్మ.

"సరిగా సమయానికి, కోరీ కోరనట్లు వచ్చారు డాక్టరుగారూ. సాయం కాలం మీ దగ్గరికి వద్దామనుకొన్నాను. ఆఫీసు గొడవల్లో పడి పరధ్యానంగా మీ ఇల్లు దాటిపోయాను. వాసంతికి మొన్నటి నుంచి జ్వరం వస్తుంది" అన్నాడు రాజశేఖరం.

"అందుకే చూసిపోదామని వచ్చాను. అమ్మాయి ఎక్కడుంది? అన్నాడు అనంతరామయ్యా.

గదిలోకి దారితీశాడు రాజశేఖరం. కొంచెంసేపు నిదానంగా వాసంతిని పరీక్షించి, "మరేం చికాకులేదు. రేపటికల్లా జ్వరం తగ్గిపోతుంది. ఇంటికి వెళ్ళి మందు పంపుతాను. అయినా కాస్త జాగ్రత్తగా వుండాలి. పళ్ళు, పాలు, బలకరమైన ఆహారం తీసుకుంటూ ఉండాలి. గర్భిణి అయిన స్త్రీ ఆరోగ్యంపైనే పుట్టబోయే బిడ్డ భవిష్యం ఆధారపడి ఉంటుంది" అన్నాడు.

అదేదో సామాన్య రోగానికి పథ్య పానాలు చెప్తున్నట్లు ఆయన అలా చెప్పుకుపోతూంటే కళ్ళప్పగించి వాసంతి వైపు చూస్తున్నాడు రాజశేఖరం. వాసంతి సిగ్గుతో ముఖం తిప్పుకుంది.

డాక్టరుగారు ఎవరికోసమో ఇటు అటు చూస్తున్నారు. "నన్ను వచ్చేదాకా చంపి తీసుకు వచ్చాడా... ఏడీ, మీ సుపుత్రుడు?"

"ఎవరు? బాబా" వాసంతి, రాజశేఖరం ఒక్కసారే ప్రశ్నించారు.

"బాబు మాటే నే నంటున్నది. ఇప్పుడు చాలా పని ఉంది. రేపు ఉదయం వస్తానంటే ఒప్పుకొన్నాడా? 'పిన్ని అన్నం కూడ తినలేదు' అంటూ ఒకటే గొడవ. ఇంతకీ నిజమే చెప్తున్నాడో, అబద్ధమే చెప్తున్నాడో తెలియదు. చాలా రోజులై ఇటువైపు రాలేదు. సరే, మిమ్మల్నందర్నీ ఒకసారి చూసినట్లవుతుందని బయలుదేరాను" అన్నారు అనంతరామయ్యా.

"మీరు రావడం మంచిదే అయింది బాబుగారూ. పదిరోజులై పిల్ల దిగజారి పోతుంటే ఏమీ తెలియక కంగారు పడ్డాను. శుభవార్త చెప్పారు. అంతేచాలు" అంది రామాయమ్మ తృప్తిగా.

అనంతరామయ్య రామాయమ్మకు వేలువిడిచిన పినతండ్రి అవుతాడు. రామాయమ్మ భర్త ఉన్నప్పటి నుంచి వారింటికి, వీరింటికి రాకపోకలు సాగుతున్నాయి. ఏదైనా పనున్నా, లేకున్నా అప్పుడప్పుడు వచ్చి చూసిపోయే అలవాటుంది అనంతరామయ్యకు.

డాక్టరుగారిని వీధి చివరివరకు సాగనంపి తిరిగి వచ్చాడు రాజశేఖరం. రామాయమ్మ ఒడిలో కూర్చుని "పిన్నికి ఎలా ఉంది నాన్నమ్మా?" అని ప్రశ్నిస్తున్నాడు బాబు.

"జ్వరం రేపటికి తగ్గిపోతుందటరా. ఇప్పుడే డాక్టరుగారు వచ్చి చూసారు. నువ్వు కంగారు చెయ్యకుండా ఉంటానంటే, నీకో మంచి సంగతి చెప్తాను" అని చెవిలో రహస్యంగా "నీకో తమ్ముడు పుడతాడురా.... తమ్ముడు" అంది రామాయమ్మ.

"నిజంగానా... నాన్నమ్మా నిజంగా... ఉండు గోపాలంతో చెప్పి ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ పరుగు తీశాడు బాబు.

ఆనందంతో రామాయమ్మ కళ్ళు చెమర్చాయి. పైటకొంగుతో కళ్లు తుడుచుకొంటూ 'రామచంద్ర ప్రభో! అంతా నీ దయ' అనుకొంది.

'మా అమ్మతో ఏది వచ్చినా చిక్కే. మొదట్లో ఆ అమ్మాయి అలాటిది, ఇలాటిది, నా మాట వినసే వినదు, బాబుని నానుండి దూరం చేస్తుంది. వాడికి నామీద విరుపులు పెడుతుంది అని చెప్తుండేది. ఇప్పుడో? కోడలంటే బెల్లం ముక్క. ప్రతి పనికి అమ్మాయి అదేమిటే, ఇదేమిటే అంటూ; ఈ అమ్మాయి లేకపూర్వం ఈ ఇల్లే నడవనట్లు అంతా కోడలి పెత్తనమే.

"బాబు మట్టుకు బాబు ఎంతగా మారిపోతున్నాడని! మొన్న పిన్నికి బాగుండవని జోళ్ళకు రంగు రాసుకొన్నాడా? ఈ రోజు ఎవరో చెప్పి పంపినట్లు డాక్టరుగారి దగ్గర హరం వేసుకు తీసుకు వచ్చాడా? తమ్ముడు పుడతాడని తెలియగానే ఎంత సంతోషపడ్డాడో... ఈ ఆత్మీయత ఇలా నిలిస్తే అంతకన్నా తనకు కావలసింది ఏమిటి?

'తన భయమే తనది కాని, వాసంతి తక్కువది కాదు. ఆమెలో ఏ వశీకరణ శక్తి ఉందో కాని, అందర్నీ తనకు నచ్చేలా ఇట్టే మార్చుకోగలదు. ఇంకొకరి మాటెందుకు? నన్ను మాత్రం వదిలిపెట్టిందా?' అనుకొని మెల్లగా నవ్వు కొన్నాడు రాజశేఖరం ఉత్సాహంగా.

◆ ◆ ◆

రెండు మూడు నెలలు మధుర స్వప్నంలా గడిచిపోయాయి. బాబు మప్పితం, బుద్ధి చూసి నమ్మలేకపోయేది వాసంతి. "ఫో దెయ్యం అంటూ ఆనాడు కచ్చిక రిమ్మింది ఈ బాబేనా?" అని.

ఏమాట చెప్పినా మారు మాట లేకుండా వింటాడు. అయినదానికి, కానిదానికి అల్లరిపెట్టడం ఏనాడో మానుకొన్నాడు. స్కూలులో కూడ బుద్ధిగా చదువుకొంటున్నాడని, తోటిపిల్లలతో కలసి మెలసి ఉంటున్నాడనీ భోగట్టాలు తెలుస్తున్నాయి.

వాసంతి జీవితంలో ఏదో నిండుతనం పొడచూపింది. గృహ జీవనం అతి ప్రశాంతంగా ప్రేమానురాగాల వెల్లువలా సాగిపోతూంది. కన్న కూతురు కన్నా మిన్నగా చూసే అత్తగారు, మనసులోని మమతను అర్థం చేసుకుని ఆదరించే భర్త, ఆత్మీయతను అందించే బిడ్డడు. అంతకన్న ఏ స్త్రీ మాత్రం కోరుకొనేదేముంటుంది?

పండు వెన్నెలలా, చల్లగా, హాయిగా ఆనందాన్ని వర్షిస్తున్న ఆ రోజులలో, ఆ పసిమి వెన్నెల మిసిమిని మలినపరిచే మబ్బు తునకలా అవతరించింది అనసూయమ్మ "రాముడూ! మన రాజు పెళ్ళాం ఈ పిల్లేనటే" అంటూ.

"ఆ... మరేం. మన జానకిరామయ్యగారు లేరూ, వారి మేనకోడలు. పేరు వాసంతి. అమ్మాయి! చిన్నత్తకు నమస్కారం చెయ్యమ్మా" అంది రామాయమ్మ.

అనసూయమ్మకు నమస్కారం చేసి పక్కగా నిల్చుంది వాసంతి. "రాజు పెళ్ళికి వద్దామని ప్రయత్నించినా రాలేకపోయాను. నిజం చెప్పద్దూ రా"దానికి మనసొప్పలేదు కూడ. పార్వతిని చూసిన కళ్ళతో ఇంకోపిల్లని రాజు పక్కగా చూడబుద్ధి కాలేదు. ఏం మప్పితం, ఏం చక్కదనం. చూస్తే ఇంకొకళ్ళకి ఆ గుణాలు రావనుకో. ఏం బ్రతుకులో, మూన్నాళ్ళ ముచ్చట. పదిరోజుల పసికందును వదిలి వెళ్ళిపోయింది. ఏడీ బాబు? బాగున్నాడా?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొంది అనసూయమ్మ.

కోడలి మరణం తనకు దుఃఖదాయకమే అయినా, నెల తప్పిన వాసంతి ఎదురుగా తన చెల్లెలు అలా రాగాలు పెట్టడం రామాయమ్మకి నచ్చలేదు.

"ఏం చేస్తామమ్మా ఎవరి ప్రాప్తం వారిది. బాబు అదృష్టవంతుడు కాబట్టే వాసంతి చేతిలో పడ్డాడు. వాడంటే కోడలు పిల్లకి ఎంత ముద్దనుకున్నావు?" అంది రామాయమ్మ.

అప్పటివరకు చిన్నత్తగారికి కాళ్ళకు నీళ్ళయినా ఇవ్వలేదని జ్ఞాపకం రావడంతో, ఇంట్లోకి వెళ్ళింది వాసంతి.

"ఆ... ఏం ముద్దోనమ్మా, నువ్వందరిని ఇట్టే నమ్మేస్తావు అక్కయ్యా. అంతా నటన కాకపోతే, సవతి తల్లికి ప్రేమేమిటే? ఎందుకయినా మంచిది, వాడి తిండీ, ఉనికి నువ్వోకంట కనిపెడుతుండు. ఆ వెనుక ఎంత ఏడ్చినా లాభం ఉండదు" అంది అనసూయమ్మ.

నీళ్ళ చెంబుతో సావిట్లోకి వస్తున్న వాసంతి చెవుల్లో ఆ మాటలు ఎక్కడ పడ్డాయో అని గాభరా పడింది రామాయమ్మ.

"లేవే.... అనూ.... లేచి స్నానం చెయ్యి. భోజనం చేద్దువుగాని, ఎప్పుడనగా బయల్దేరావో" అని చెల్లెలిని ఆమె మాటల నుంచి మళ్ళింప చూసింది.

"అబ్బాయి రానీ, నాకేం తొందరొచ్చింది?" అంది అనసూయమ్మ. "వాడింత వేగం రాడే. కోడలు ఓపలేని పిల్ల. మనం తింటేగాని అది తినదు లేమరి" అంది రామాయమ్మ.

"అయ్యో రామ! అప్పుడే ఆ సౌభాగ్యం కూడానా? ఇంక ఆ గుంట వెధవపని అయినట్లే" అంది పుల్లవిరుపుగా.

ఆ మాటలకు వాసంతి, రామాయమ్మ కూడ నివ్వెరపోయారు. ఏదో తప్పు చేసిన దానిలా వాసంతి ముఖం దించుకు వెళ్ళిపోయింది.

"అదేమిటే అనూ! కోడలి ముందు అలా అంటే ఆ పిల్ల ఏమనుకొంటుంది? ఎవరి కడుపు తీపి వారిది. రెండో పెళ్ళి అయినంత మాత్రాన పిల్లలు పుట్టరా? దానికి పిల్లలు పుడితే బాబుకేం నష్టం వస్తుంది? అది అలాటి పిల్లకాదే. నువ్వే చూస్తావుగా" అంది రామాయమ్మ అనునయంగా.

◆ ◆ ◆

ఏనాటి కక్షనో ఈనాడు తీర్చుకోవచ్చినట్లు గుమ్మంలో కాలు పెట్టగానే అనసూయమ్మ తన మీద విరుచుకుపడుతుంటే, వాసంతికి ఏమీ అర్థం కాలేదు. ఈవిడకు తనమీద ఇంత దురభిప్రాయం ఎందుకు కలిగిందా అని ఆశ్చర్య పోయింది.

కాని, ఆ కోపం తన ఒక్కతెమీద ప్రత్యేకించి కాదని, తను స్థానంలో ఏ వ్యక్తి ఉన్నా ఆవిడ కోపం అలానే ఉండేదని వాసంతికి తెలియదు. ఇంతకూ కారణం పార్వతి ఆమె అన్నగారి కూతురు కావడమే.

పార్వతి స్థానంలో ఎవరున్నా ఆమె సహించలేదు. పన్నెండేళ్ళు నిండక పూర్వమే, నుదుటి కుంకుమ చెరుపుకొని అన్నగారి పంచన చేరింది అనసూయమ్మ. పార్వతిని కనడం వరకే మహాలక్ష్మమ్మ చేసింది కాని ఆ పైన పెంపకం అంతా అనసూయమ్మదే.

పార్వతి మరణం అనసూయమ్మ హృదయంలో మానని గాయంగా మారింది. నిజమే, పెంచిన ప్రేమ అలాటిది. కాని, అంతమాత్రాన వాసంతిని ద్వేషించాలని ఎక్కడుంది? తన మేనకోడలి బిడ్డణ్ణి అంత ప్రేమగా చూస్తున్నందుకు సంతోషించడానికి బదులుగా కుశంకలు వెళ్ళబుచ్చుతూ తన మనస్సులోని విషం కక్కవలసిన అవసరం ఏముంది?

అనసూయమ్మ నోటి దుడుకు మనిషి. ఎంతమాట తోస్తే అంత మాట అనేందుకు వెనుదీయదు. ప్రశాంతంగా సాగుతున్న ఈ సంసారంలో ఏమి చిక్కులు తెచ్చి పెడుతుందో అని హడలిపోయింది రామాయమ్మ.

రామాయమ్మ, అనసూయమ్మ ఒక్క తల్లిబిడ్డలే అయినా, రామాయమ్మకు మంచి, చెడ్డ విచక్షణ జ్ఞానం ఉంది. అనసూయమ్మ తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనేరకం. రేపు సూర్యుడు పడమట ఉదయిస్తాడు అన్నా నమ్ముతుంది. కాని, సవతిపిల్లలను రెండవభార్య ముద్దుగా చూస్తున్నదంటే ఆమెకు నమ్మశక్యం కాదు.

స్కూలు నుంచి తిరిగివచ్చిన బాబును ఒడిలో కూర్చోపెట్టుకొని తను తెచ్చిన ఖర్జూరం పొట్లం యిచ్చింది అనసూయమ్మ.

"చిన్న నాయనమ్మరా" అంది రామాయమ్మ.

"తిను బాబూ.... తిను. ఎప్పుడనగా తిండితిని పోయావో" అంది అనసూయమ్మ.

"ఊహూ... ఇప్పుడు తినను. చేతులు కడుక్కొని, బట్టలు మార్చుకొని అప్పుడు తినాలి" అన్నాడు బాబు.

"మరేం ఫర్వాలేదులే. ఈ రెండు పిక్కలూ తిను."

"చేతులంతా బుగ్గిగా ఉన్నాయి నాన్నమ్మా. నేను బడిలో ఆడుకొని వస్తానా, కడుక్కోందే తినకూడదు" అంటూ ఇంట్లోకి పరుగు తీశాడు బాబు.

"ఇప్పుడిన్ని కబుర్లు చెప్తున్నాడా అనూ, పళ్ళు తోముకునేందుకు కూడా నానా అల్లరీ చేసేవాడు. అంత మొండి పిల్లణ్ణి నువ్వు చూడబోవు. ఎలా మార్చిందో మరి... ఆ దేవుడికే తెలియాలి. పిన్ని ఎంత చెప్తే అంత" అంది సంతోషంగా రామాయమ్మ.

“నీ సంబరం బాగుంది కాని, పిల్లడికి మందూ మాకూ పెట్టలేదు కదా? మొదట ఏమి తెలియెకపోయినా, వెనుక నుంచి వికటిస్తే ప్రాణాలకే ముప్పు” అంది అనసూయమ్మ.

పచ్చకామెర్ల వారికి జగమెల్లా పచ్చగా కన్పిస్తుందంటారు. అలానే సంశయాన్విత మనస్సులకు ఎదుటివారు చేసే ప్రతి పనిలోను అనుమానాలే కలుగుతాయి.

◆ ◆ ◆

చాలా రాత్రివరకు కథలు, కబుర్లు చెబుతూ బాబును తనదగ్గర ఉంచుకొంది అనసూయమ్మ. పదిగంటలు కావస్తున్నా ఇంకా పడుకొందుకు రాలేదు బాబు.

“వసూ, బాబుని పిల్చుకురా. చాలా రాత్రయింది. మళ్ళా ఉదయం స్కూలు వేళకి నిద్రలేవడు” అన్నాడు రాజశేఖరం.

“ఒక్కరోజుకి మరేం ముంచుకుపోదు. రోజూ వెళ్తున్న బడే కదా. వస్తాదులే వెళ్ళు” అంది అనసూయమ్మ.

చిన్నపిల్లలు కథలంటే ప్రాణం పెడతారు. అందులోను రాక్షసులు, రాజకుమారులు వచ్చే కథలయితే మరీ ఇష్టపడతారు. తాము కూడా ఆ రాజకుమారులలాగే ధైర్యంగా పోరాడి, రాక్షసులను హతమార్చాలని ఆశించని బాలుడు ఉండడు.

రాత్రల్లా అదే కలలతో కలత నిద్దురబోయిన బాబుకు తెలతెలవారుతున్న దనగా గాఢ నిద్రపట్టింది. వాసంతి తలచినట్లే రెండు మూడుసార్లు లేపినా బాబు లేవలేదు.

ఇంక ఎలాగూ ఆనాటికి స్కూలుకు పోయేది లేదని ఊరుకొంది వాసంతి. తొమ్మిది గంటలకు మెల్లగా కళ్ళు విప్పాడు బాబు. కిటికీలో నుంచి ఎర్రగా ఎండ పడుతుంది. తుళ్ళిపడి లేచి పెరట్లోకి వెళ్ళాడు. అక్కడ ఎవ్వరూ కన్పించ లేదు. పళ్ళు తోముకొని, ముఖం కడిగాననిపించుకొని లోపలికి వచ్చాడు బాబు. వంట ఇంట్లో కూడ పిన్నిలేదు.

అనసూయమ్మ గ్లాసులో కాఫీ పోసి “రా బాబూ, కాఫీ తాగుదువుగాని” అంది.

“వాడికి అమ్మాయి కాఫీ ఇయ్యదే. ఆ గాజుగ్లాసులో కొంచెం పాలు పోసి ఇయ్యి” అంది అప్పుడే పూజ ముగించుకు లేచిన రామాయమ్మ.

“ఆఁ సింగినాదం. ఒక్కపూటకి, మరేం కొంపమునిగిపోదు. చిన్నవాడు ఆశతో చూస్తున్నాడు అన్నిటికీ ఆవిడ ఇష్టమేనేమిటి? నువ్వు ఆ మాత్రం చెప్పలేవూ?” అని నిలదీసింది.

చిన్నపిల్లవాడికి కాఫీకి బదులుగా పాలు ఇస్తూంటే అందులో దోషం ఏముందో రామాయమ్మకు బోధపడలేదు. రెండు రోజులుండి వెళ్ళిపోయే చెల్లెలితో వాదన ఎందుకని ఊరుకొంది.

“సరే ఏదో ఒకటి ఇయ్యి” అని, ముఖం కడుక్కున్నావురా బాబూ” అని మనుమని ప్రశ్నించింది.

"కడుక్కున్నాను... పిన్ని ఎక్కడి కెళ్ళింది నాన్నమ్మా?" అన్నాడు బాబు.

"ఇంత పొద్దున్నే ఎక్కడి కెళుతుంది? సావిట్లో ఉన్నదేమో చూడు" అంది రామాయమ్మ.

వాసంతి ఆనాటి దినపత్రిక చూస్తుంది. బాబు రాకను చూసీ, చూడనట్లే పత్రిక పేజీలు తిరగవేస్తుంది.

"పిన్నీ"

"ఏం?" అంది అటు చూడకుండానే.

"నాకు పాలు కావాలి."

"ఎవ్వరూ భోజనానికి ముందు పాలు తాగరు."

"పొద్దున్న రోజూ తాగుతున్నాను కదా?"

"రోజూ స్కూలుకు వెళ్తున్నావు. ఈరోజు వెళ్ళావా?"

"స్కూలుకి వెళ్ళకపోతే పాలు తాగకూడదా?"

"వేళకి సరిగా లేస్తే తాగచ్చు."

"నాకు ఇప్పుడే కావాలి."

"మీ చిన్నాన్నమ్మ నడుగు."

"ఉహూఁ నువ్వే ఇయ్యాలి."

"భోజనానికి ముందు నే నియ్యను."

"ఎందుకియ్యవేం? నాకు పాలు కావాలి."

"నే నియ్యనన్నానుగా."

"నాకు కావాలి... నాకు పాలు కావాలి."

"అదేమిటే అమ్మాయి! వాడు పాలకోసం అలా ఏడుస్తుంటే, చూస్తూ ఊరుకొన్నావు" అంది రామాయమ్మ.

"మీరు ఊరుకోండత్తయ్యా. పదిగంటలు కావస్తుంది. అన్నం పెట్టి ప్రైవేటుకు పంపాలి. ఇప్పుడు పాలుతాగితే ఇంక అన్నం తింటాడా? కావాలంటే భోజనం అయ్యాక ఇస్తాను" అంది వాసంతి.

"మరేం, వాళ్ళ నాన్న రెండొందలు గడించి ఇంట్లో పోస్తుంటే వాడికి పురిషెడు పాలు తాగే తాహతులేదు. రారా బాబూ, నీ ఖర్మ అలా కాలింది. ఈ కాస్త కాఫీ నీళ్ళయినా గొంతుకలో పోసుకో" అంటుంది వంట ఇంట్లోంచి అనసూయమ్మ.

"నువ్వు పాలు ఇయ్యకపోతే, ఆ కాఫీయే తాగేస్తాను" అన్నాడు బెదిరింపుగా బాబు.

"తాగాలనుంటే తాగు. ఎవరొద్దన్నారు" అంది వాసంతి నిర్లక్ష్యంగా.

బాబు అభిమానం దెబ్బతింది. తాను కాఫీ తాగుతానంటే, పిన్ని వద్దని వారిస్తుందనుకొన్నాడు. తాగితే నీతో మాట్లాడనని బెదిరిస్తుందనుకొన్నాడు. కాఫీ ఒంటికి మంచిది కాదు, చిన్నపిల్లలు తాగకూడదని పూర్వంలాగే సముదాయిస్తుందనుకొన్నాడు. అటువంటిది ఏమీలేక 'తాగితే తాగు, నాకేం పట్టదు' అన్న ధోరణిలో పిన్ని మాట్లాడేసరికి బాబు మనసు బాధపడింది.

"నే నేమయినా పిన్నికి బాధలేదు. కాఫీ తాగేస్తాను. కాఫీ తాగేస్తాను. ఉష్ణం వచ్చి చచ్చిపోతాను" అనుకొన్నాడు కాఫీకి, విషానికి భేదం తెలియని ఆ పసివాడు.

అనుకొన్నదే తడవుగా కంచు గ్లాసుడు కాఫీ గడగడ తాగేశాడు. ఆ పూట వాసంతితోపాటు భోజనం చెయ్యలేదు. వంట ఇంట్లో వేరుగా పెట్టించుకు తిని ప్రైవేటుకు వెళ్ళిపోయాడు.

సాయంకాలం స్కూలు నుంచి రాగానే అలవాటు చొప్పున తన దగ్గరకు వస్తాడనుకొంది వాసంతి. అయిదుగంటలు కావస్తున్నా ఇంకా బాబు రాలేదు. వాసంతి కంగారు పడింది.

"బాబు రాలేదా అత్తయ్యా?" అంది వీధి వరండాలో కూర్చున్న అత్తగారితో.

అప్పచెల్లెళ్ళిద్దరూ వత్తులు నలుపుకుంటూ, తమ చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకొంటున్నారు. వాసంతి ప్రశ్నతో తుళ్ళిపడింది రామాయమ్మ. మాటల సందడిలో బాబు వచ్చి తన దగ్గర పది నయాపైసలు తీసుకు పారిపోవడం మరిచిపోయింది. పిన్నిమీద కోపంతో ఇంట్లోకి పోక, ఆ డబ్బుతో ఏ సెనక్కాయలో కొనుక్కొని తినుంటాడు అనుకొంది.

"అరగంట కిందటే వచ్చాడే.... ఇంట్లోకి రాలేదా?" అంది.

"అయిదయినా రాకుంటే ఏమయిందా అని చూస్తున్నాను. మీ రేమయినా డబ్బులు ఇచ్చారా?" అని ప్రశ్నించింది వాసంతి.

"ఆ! ఇస్తే ఇస్తుందే.... ఆమాత్రం తాహతు, హక్కు ఆమెకి లేదా? మనవడికి ఓ బేడ్డబ్బులిస్తే నీ ఆస్తేం తరిగిపోదులే" అని అందుకొని సమాధానం చెప్పింది అనసూయమ్మ.

"ఆ డబ్బుతో నా ఆస్తి తరిగిపోతుందని కాదు. అడ్డమైనవి కొనుక్కు తింటే వాడి ఆరోగ్యం పాడవుతుందని" అంది వాసంతి.

"ఓ యబ్బ! ఎక్కడలేని అభిమానం ఈవిడకే వలికిపోతుంది అంది అనసూయమ్మ ఈసడింపుగా.

"ఛీ..... ఇలాటి మనుష్యులతో మాట్లాడడం నాదే తప్పు" అనుకొని ఇంట్లోకి వెళ్ళిపోయింది వాసంతి.

ఇంటికి వచ్చిన తరువాత కూడ పిన్నిని తప్పుకొనే తిరిగాడు బాబు. ఆ రాత్రి ముందు రోజులాగే అనసూయమ్మ దగ్గరే పడుకొన్నాడు.

"మీ పిన్నమ్మ ఎన్నాళ్ళుంటారేమిటి" అని ప్రశ్నించింది వాసంతి.

"ఏమిటీ సంగతి" అన్నాడు ఆశ్చర్యంగా రాజశేఖరం.

"ఊరికే అడిగాను."

......

"మా అమ్మను చూసి చాలా రోజులయింది. ఒకసారి వెళ్ళిరానా?"

"నీకు వెళ్ళాలని ఉంటే తప్పకుండా వెళ్ళు. కాని బాబు సంగతే.... ఆ ముసిలాళ్ళిద్దరి మీద వదిలివేస్తే...." అన్నాడు సంశయాత్మకంగా, ఏమయినా జరగవచ్చునన్న ధోరణిలో.

"వెళ్ళేమాటుంటే బాబుని తీసుకొనే వెళ్తాను" అంది వాసంతి నిశ్చయంగా.

"బాగుండదేమో. ఆవిడ ఇంతా వాడికోసం వస్తే, నువ్వు తీసుకుపోతానంటే కోపం రావచ్చు. నువ్వయినా ఒకటి, రెండు రోజులుండి వెళ్ళడం మంచిది. 'నేను గుమ్మంలో కాలు పెట్టగానే పుట్టింటికి పారిపోయింది' అంటుంది. మా పిన్ని నోరు అంతమంచిది కాదు" అన్నాడు రాజశేఖరం.

రెండు మూడు రోజులుండి ఆవిడే వెళ్ళిపోవడంతో, వాసంతి ప్రయాణం గురించి ఆలోచించనేలేదు. ఉన్నది రెండు రోజులయినా చెయ్యవలసిందంతా చేసే వెళ్ళింది అనసూయమ్మ.

ఆరు నెలలయి తాను పడిన శ్రమ అంతా వృథా అయినందుకు బాధపడింది వాసంతి. బాబు అల్లరి, పెంకెతనంతోపాటు మాటలు కూడా నేర్చాడు.

"నువ్విలా అల్లరి చేస్తే మరి నీకు తమ్ముడు పుట్టడు. తెలుసా" అంది బెదరింపుగా రామాయమ్మ.

"పుట్టకపోతే పోనీ, వాడు నా తమ్ముడు కాడు" అన్నాడు బాబు పెద్దవాడులా.

అంతవరకు తమ్ముడు, తమ్ముడు అని మురిసిపోతున్నవాడు అలా అనడంతో తెల్లబోయింది రామాయమ్మ.

"ఎవరు చెప్పారు వెధవా? పిన్నికొడుకు నీకు తమ్ముడే అవుతాడు, అంది" ఆ విషబీజాన్ని మొలకలోనే త్రుంచే ప్రయత్నంలో.

"చిన్నానమ్మ చెప్పింది. మా అమ్మ చచ్చిపోయింది, మరి నాకు తమ్ముళ్లు పుట్టరని" అన్నాడు బాబు.

పసివాడి మనసులో విషం పోసి పోయిందని, చెల్లెల్ని మనసులోనే తిట్టుకుంది రామాయమ్మ.

◆ ◆ ◆

చాకలివానికి బట్టలు వేస్తూ జేబులోని సొమ్ము, కాగితాలు తీసి టేబిల్‌పై ఉంచింది వాసంతి . ఆ కాగితాల మధ్యన తొంగి చూసిన ఒక ఉత్తరం ఆమెలో కుతూహలాన్ని

రేపింది. సాధారణంగా బంధుమిత్రుల దగ్గరి నుంచి ఏ ఉత్తరం వచ్చినా వాసంతికి చూపించి, ఆమె చూసినవారు కాకపోతే వాళ్ళ గురించి చెప్పడం రాజశేఖరాని కలవాటు. దానికి వ్యతిరేకంగా వారం రోజులయి వచ్చిన ఆ ఉత్తరాన్ని రహస్యంగా ఎందుకు దాస్తున్నట్లు అనుకొంది.

అది రాజశేఖరం పెద్ద మేనమామ వ్రాసింది. అందులో తాను చూడకూడని సంగతులున్నాయేమో, అందుచేతనే తనకు చూపలేదమోనని అనుకొంది. కాని, అనసూయమ్మ వచ్చి వెళ్ళాక ఆ ఇంటి వారి మనః ప్రవృత్తులు ఎలా ఉన్నాయో తెలుసుకోడం, ఆమెకు అవసరంగా తోచి ఉత్తరం విప్పింది.

"చిరంజీవి రాజశేఖరానికి

మామయ్య ఆశీర్వచనములు.

ఈ మధ్య చాలాకాలంగా నీకు ఉత్తరం వ్రాయలేదు. బాబు నీ దగ్గర కులాసాగా ఉంటాడనే నమ్మకంతో అశ్రద్ధ చేశాను. మొన్న అనసూయ వెళ్ళి వచ్చాక ఇంక ఆలస్యం చెయ్యడం అంత మంచిది కాదనిపించి వ్రాస్తున్నాను.

కోరినంత కట్నంతో, రత్నంలాంటి పిల్లను నీ చేతుల్లో పెట్టాను. నీ నిర్భాగ్యం కొద్దీ ఆ రత్నాన్ని దక్కించుకోలేకపోయావు. దానికి ఎవరినీ నిందించి ప్రయోజనం లేదు. ఆ వెనుక నువ్వు ఇల్లు పట్టక తిరిగిన నాడు కూడ నేనేమీ అనలేదు. నీ బాధలో నువ్వున్నావు. కాలం మాన్పని గాయం ఉండదు. వాడే సర్దుకొని పిల్లాడిని చూసుకుంటాడనుకొన్నాను.

అన్నిటికి పెద్దది అక్కయ్య వుంది. పార్వతి బిడ్డను ఆమె కన్న ఆత్మీయంగా చూడగలిగేవారు ఎవరుంటారు అన్న ఆశతో ఆ విషయంలో కల్పించుకోలేదు.

నీ ద్వితీయ వివాహం గురించి విన్నాను. జీవితంలో మూడు పదులు దాటని నిన్ను పునర్వివాహం చేసుకోవద్దని వారించేటంత అవివేకిని కాను. కాని, ప్రాణంకన్న మిన్నగా ప్రేమించిన పార్వతి బిడ్డడికి అన్యాయం చెయ్యవనే నమ్మాను.

భార్యపై మక్కువతో పిల్లాడి నలా గాలికి, ధూళికి వదులుతావనుకోలేదు. అక్కడి పరిస్థితి అంతా అనసూయ చెప్పింది. మీ అమ్మను కూడా మీకు అనుకూలంగా మార్చుకున్నారని తెలిసింది.

అనసూయ మాటలలో అతిశయోక్తి ఉండవచ్చు. అయినా, నిప్పుంటేగాని పొగరాదుకదా? ఈ పరిస్థితుల్లో పిల్లాడిని అక్కడ వదలడం వాడి భవిష్యత్తుకు ఏ మాత్రం మంచిదిగా నాకు తోచడం లేదు. ఒకటి రెండు రోజులు సెలవు తీసుకొని వచ్చి దిగబెట్టు. నా నలుగురి పిల్లలలో వాడొకడు. మీకు భారం కూడా తగ్గుతుంది.

"సర్వదా నీ శ్రేయోభిలాషి

మీ మామయ్య."

రాజశేఖరం ప్రయాణంలోని రహస్యం అప్పటికి అర్థమయింది వాసంతికి. తన ముక్కు మొగము తెలియని అతని మేనమామ తనను అపార్థం చేసుకొన్నాడన్న బాధ ఆమెకు కలుగలేదు. కాని ఇన్నాళ్ళుగా తనను చూస్తున్న భర్త కూడా ఈ విషయంలో గోప్యం చెయ్యడం ఆమెకు కష్టం కలిగించింది. ఇందులో అత్తగారిపాలు ఎంతో ఆమెకు తెలియదు.

వీధి గుమ్మంలో జట్కా ఆగింది. రాజశేఖరం వెనుకగా బండివాడు పెట్టె పట్టుకు వస్తున్నాడు. బాబుకోసం ఇటు, అటు చూసింది వాసంతి.

"బాబు రాలేదా" అని భర్తను ప్రశ్నించింది.

"నాలుగు రోజులుంచుకొని పంపుతానన్నాడు మామయ్య" రాజశేఖరం జవాబు చెప్పాడు. అంతకన్న ఏమి చెప్పగలడు? అటు తండ్రి వంటి మేనమామ. పెంచి పెద్దచేసిన అతని మాట కాదనలేడు. ఇటు అదృష్టం మూర్తీభవించినట్లు, తన ఇంట కాలుపెట్టిన భార్య. బాబును కన్నబిడ్డలా చూసుకొనే వాసంతికి 'నువ్వు సవితి తల్లివి. బాబును నీ దగ్గర ఉంచేందుకు వారు ఇష్టపడలేదు' అని ఎలా చెప్పటం?

"బాబు అక్కడ ఉండేందుకు ఇష్టపడ్డాడురా?" రామాయమ్మ ప్రశ్నించింది.

"అక్కడ వాడి ఈడుపిల్లలు ఉన్నారు కదా? ఇక్కడికి వచ్చినప్పుడు పిన్ని దగ్గర కొంత చనువు అయింది కూడ. అత్తయ్యని అప్పుడే అమ్మమ్మ, అమ్మమ్మ అంటూ ఒక్క గడియ వదలకుండా తిరుగుతున్నాడు" అన్నాడు రాజశేఖరం.

ఆ పైన నాలుగైదు రోజుల వరకు ఇంటిలో బాబు ప్రస్తావన రాలేదు. ఇరుగుపొరుగు పిల్లలు పలకా పుస్తకాలూ పట్టుకు స్కూలుకు వెళ్తూంటే వాసంతి మనసు మథనపడేది. 'పిల్లాడి కిప్పుడిప్పుడే చదువు మీద దృష్టి కుదురుతున్న దనుకొంటుంటే, అక్కడికి పంపి కూర్చున్నారు. సెలవులలో పంపితేకాదా' అనుకొనేది.

ఆమాటే అత్తగారితో అంటే "మా తమ్ముడు వాడినలా వదిలేయడు లేవే. ఏదో బడిలో చేర్పిస్తాడు" అంది.

నాలుగు రోజులలో వస్తాడనుకున్న బాబు నెలరోజులయినా రాలేదు. వాసంతి మనసు ఉడికిపోయింది. భర్త, అత్తగారు కావాలనే తన దగ్గర ఏదో దాస్తున్నారనుకుంది. నాలుగు రోజులలో వస్తాడనుకొన్న మనుమడు నెలదాటినా రాకపోతే, అలా నెమ్మదిగా ఊరుకొనే మనో నిబ్బరం అత్తగారికి లేదు. అందుచేత ఈ విషయం ముందుగానే ఆమెకు తెలిసి వుండాలి అనుకొంది వాసంతి.

రాజశేఖరాన్నే ప్రశ్నించింది, "బాబుని ఎప్పుడు తీసుకు వస్తారు?" అని.

"ఎక్కడో దగ్గర కులాసాగా ఉండనిద్దూ" అన్నాడు రాజశేఖరం విరక్తిగా.

"వాళ్ళు మాత్రం పై వాళ్ళేం కారుగా" అంది కొడుక్కు అన్నం వడ్డిస్తూ రామాయమ్మ.

వాసంతి మనసు క్రుంగిపోయింది. అక్కడికి పైది తనే అన్నమాట. బాబును తన శక్తినంతా వెచ్చించి బాగు చేయాలనుకుంది. ప్రపంచంలో సవతితల్లి అనే పదం కఠోరతకు మారుపేరుగా నిలిచిపోయింది. ఆ సామెతను చెరిపి వ్రాసేలా చేద్దామనుకొంది. కాని, తన ఆలోచనలన్నీ ఆచరణలోకి రాకపూర్వమే బాబును తన నుండి దూరం చేశారు అని బాధపడింది.

రోజులు నడుస్తున్న కొద్దీ బాబు స్థానం ఆమె హృదయంలో పలుచబడింది. ఆ స్థానాన్ని మరొకజీవి ఆక్రమించుకుంది. అదే... ఆమె గర్భస్థ శిశువు. పుట్టబోయేపాప పెంపకానికి ప్లానులు తయారు చేసుకుంటూ ఆనందం పొందసాగింది వాసంతి.

ఆ గడియ రానే వచ్చింది. పనసపండులాంటి పాపణ్ణి కన్నది వాసంతి. బాలసారెనాడు రాజశేఖరం చిన్న మేనమామ వచ్చాడు. పెద్దాయన రావడం కాని, బాబును పంపడంకాని చెయ్యలేదు. 'తమ్ముడు తమ్ముడు' అని పలవరించే బాబు, తమ్ముణ్ణి చూసేందుకైనా రాలేదని వాసంతి వ్యధ చెందింది.

"ఏమిరా, బాబు నీతో వస్తాననలేదా?" తమ్ముని ప్రశ్నించింది రామాయమ్మ.

"అక్కయ్యా, అనసూయ సంగతి నీకు తెలియదా? పసివాళ్ళు తడిమట్టి వంటివాళ్ళు. వాళ్ళను ఎలా కావాలంటే అలా తయారుచేసుకోవచ్చు. దానికి ఎంతో పరిశ్రమ అక్కరలేదు" అన్నాడు అర్థయుక్తంగా.

ఆ మాటలో దాగిన అర్థాన్ని వాసంతి పసిగట్టింది. మాయామర్మం తెలియని రామాయమ్మకు మాత్రం అంతుపట్టలేదు.

"అంటే" అని ప్రశ్నించింది.

ఇంక అతనికి విపులీకరించక తప్పలేదు. "ఈ పిన్ని, ఈ తమ్ముడు బాబుకి ఎవరూ కారు" అన్నాడు.

వాసంతి అక్కడి నుండి ఎప్పుడో వెళ్ళిపోయింది.

తప్పంతా తమదే; పెద్ద తమ్ముడు ఏదో అన్నాడని బాబును అక్కడ వదలి పెట్టడం అంతమంచి పని కాదేమో? అనుకొంది రామాయమ్మ.

◆ ◆ ◆

తన పాపను "చిట్టిబాబు" అని పిలుచుకొనేది వాసంతి. చిట్టిబాబుకు మూడవ ఏడు రాగానే పుట్టు జుత్తు తీయించ నిశ్చయించారు. ఆ సందర్భంలో బాబును తీసుకుని ఒకసారి రమ్మని మేనమామకు ఉత్తరం వ్రాశాడు రాజశేఖరం. మనుమని చూసి చాలాకాలం అయిపోయింది, తప్పకుండా తీసుకురమ్మని తన మాటగా వ్రాయమంది రామాయమ్మ.

ఆ కవరు మూసేలోగా బాబుకు నాలుగు పంక్తులు ఉత్తరం వ్రాసి పెట్టింది వాసంతి. ఎంత కాదనుకొన్నా తనలో మొట్టమొదటగా మాతృ భావన రేపిన వాడుబాబు. బాబును

సవితి కొడుకుగా చూడడం తన వల్ల కాని పని. తన మాటమీదనైనా బాబువస్తే... అదే ఆమె ఆశ. ఆ ఆశతోనే ఉత్తరం వ్రాసింది. బాబు నాలుగవ తరగతి చదువుకు అర్థమయ్యేలా నాలుగు పంక్తులు వ్రాసి "ప్రేమతో .... అమ్మ" అని సంతకం చేసింది.

రాజశేఖరం వ్రాసిన ఉత్తరం చదివి మౌనం వహించాడు మేనమామ. ఆటల నుంచి అప్పుడే తిరిగి వచ్చిన బాబు "తాతయ్యా, ఉత్తరం ఎక్కడి నుంచి?" అని ప్రశ్నించాడు.

"మీ నాన్న దగ్గరి నుంచిరా.... వాళ్ళ పాపకి పుట్టు జుత్తు తీయిస్తారట. వెళ్తావా?" అన్నాడు.

"నేను వెళ్ళను" అన్నాడు బాబు తడుముకోకుండా.

"అన్నట్లు ఇందులో నీకో ఉత్తరముంది చూస్తావా?"

"నాకా... నాకు ఉత్తరమా తాతయ్యా?" అన్నాడు బాబు ఆశ్చర్యంగా.

'తన కెవరయినా ఉత్తరం వ్రాస్తారా? తనింత చిన్నవాడు కదా. అనుకొన్నాడు బాబు. కవరులోంచి చిన్న కాగితపు మడత తీసి మనుమని చేతిలో పెట్టాడు తాతయ్య.

"బాబూ"

తమ్ముణ్ణి చూడాలని లేదూ? ఎంత చక్కగా ఉన్నాడనుకొన్నావు? గోపాలం తమ్ముడికన్నా ఎంతో బాగున్నాడు. నిన్ను 'అన్నా, అన్నా అని పిలుస్తున్నాడు. వస్తావు కదూ?

"ప్రేమతో

అమ్మ."

బాబు చేతిలో ఉత్తరం జారిపోయింది. అప్రయత్నంగా 'అమ్మ.... అమ్మ' అన్నాడు. అంతవరకు సుధ, రాజు అత్తను అమ్మ.... అమ్మ అంటుంటే రాజు తనూ అనడం మొదలుపెట్టాడు. "అమ్మేమిటిరా మొద్దూ, అత్త అనాలి" అని వారించారు ఇంట్లో వాళ్ళు.

పిన్నిని అమ్మ అనకూడదు. అత్తను అనకూడదు. అమ్మమ్మ నన కూడదు. మరి తను ఎవరినీ అమ్మ అననేకూడదా? నాకు అమ్మే లేదా అని దిగులు పడ్డాడు బాబు.

ఇప్పుడు వాసంతి "అమ్మ" అని వ్రాయడంతో తనకు కూడా ఒక అమ్మ ఉంది. తనూ రాజు, సుధ పిలుస్తున్నట్లుగా 'అమ్మా, అమ్మా' అని పిలవ వచ్చు అనుకొన్నాడు.

"నేను వెళ్తాను తాతయ్యా" అన్నాడు.

అతని ముఖంలోని ఆశారేఖను ఆ వృద్ధుడు గమనించకపోలేదు. "ఏ ముహూర్త బలం ఎటువంటిదో? భగవంతుడు అనుగ్రహిస్తే వాడి ఆశ ఫలప్రదం కాకూడదా? ప్రేమతో.... అమ్మ అని తనయుణ్ణి పిలిపించు కొంటున్న ఆ మాతృహృదయాన్ని మమతతో ఆ సర్వేశ్వరుడు నింపకపోతాడా అనుకొన్నాడు.

మరుసటి రోజునే తాతా, మనుమలు ప్రయాణమయ్యారు. బాబు మనసు రైలు వేగానికి లయ వేస్తున్నది. రైలు చక్రాలన్నీ "అమ్మ... తమ్ముడు, అమ్మ,... తమ్ముడు..." అని పదం పాడుతున్నాయి.

అసుర సంధ్యవేళ అంగణంలో దీపం పెడుతున్న వాసంతి వాకిట్లో బండి ఆగడం చూసింది. బండిలో నుంచి ఒక వృద్ధుడు, ఒక బాలుడు దిగుతుండడం ఆ మసక వెలుగులో అస్పష్టంగా కనిపించింది.

ఒక్క పరుగులో గుమ్మం దాటి చావిట్లోకి వచ్చింది. ఎదురు గుండా బాబు. బాబు పొడుగెది గాదు. పొడుగ్గా, బొద్దుగా ఉన్నాడు. గుండ్రని ముఖం, ఉంగరాల జుట్టు, ఆరోగ్యంగా ఠీవిగా ఉన్నాడు.

"బాబూ" అని చేతుల్లోకి తీసుకొంది వాసంతి.

బాబు మాట్లాడలేదు. ఆమె చేతిని తప్పించుకొని ఎదురుగా వస్తున్న నాయనమ్మ దగ్గరికి వెళ్ళిపోయాడు.

వాసంతి ఉత్సాహం వాడిపోయింది. బాబుకు తనపై కోపం ఇంకా పోలేదా? అనుకొంది.

ఆ మాట, ఈ మాటలతో రాత్రి భోజనాలు పూర్తయాయి. మేనమామ ఈనాటికైనా తన్ను క్షమించి, తన ఇంటికి రావడం రాజశేఖరానికి ఎంతో సంతోషాన్నిచ్చింది. రాక రాక వచ్చిన తమ్ముణ్ణి, మనుమణ్ణి చూసుకొని ముచ్చట పడుతుంది రామాయమ్మ.

చిట్టిబాబును పక్కలో వేసుకుని నిద్రపెడుతుంది వాసంతి.

"అమ్మా పాట" అన్నాడు చిట్టిబాబు. అమ్మ పాట పాడితేగాని, నిద్రపోడం చిట్టికి ఏనాడూ అలవాటులేదు. పరధ్యానంలో ఆ మాటే మరిచిపోయింది వాసంతి.

"పాట వింటేకాని నిద్రరానంటుందా చిట్టీ?" అంది ఆప్యాయంగా చిట్టిబాబు తల నిమురుతూ.

"ఊ" అన్నాడు చిట్టి.

"దినదినము పాపణ్ణి దీవించి పొండి
దేవలోకములోని దేవతల్లారా"

శ్రావ్యమైన కంఠముతో పాటపాడుతుంది వాసంతి. పాట పూర్తయింది.

"అమ్మా" ఆమె బుగ్గపై చెయ్యిపడింది.

"ఇదేమిరా ఈ అఘాయిత్యం, ఇంకా నిద్రరాలేదూ?" అంది చెయ్యి పట్టుకొంటూ వాసంతి.

పక్కలో చిట్టిబాబు నిర్మలంగా నిద్రపోతున్నాడు. మరి ఈ చెయ్యి.... తలతిప్పి చూసింది.

బాబు... బాబు ఎంతసేపటినుంచో తల వెనుకగా నించున్నాడు. చిట్టిబాబు "అమ్మా పాట" అన్నప్పుడు 'తనుకూడా అలా పిలిస్తే' అనుకొన్నాడు. పాట పూర్తయే సరికి బాబు

కళ్ళలో నీళ్ళు నిలిచాయి. అమ్మకు చిట్టి తమ్ముడంటే ఎంత ప్రేమ! తనంటే కూడానా? ఆత్రుతను ఆపుకోలేకపోయాడు "అమ్మా" అన్నాడు వాసంతి బుగ్గపై చెయ్యి ఉంచుతూ.

"బాబూ, నా బాబూ... రా నాన్నా" అని లేచి గుండెల కదుముకుంది వాసంతి. ఆమె హృదయం మాతృగర్వంతో పొంగిపోయింది.

"మాతృప్రేమ అజేయం. ఇతరులు దానికి ఎన్ని అడ్డంకులు కల్పించినా, ఆ ప్రేమవాహినిలోపడి కొట్టుకు పోవలసిందేకాని అడ్డు నిలువలేవు" అనుకొంది.

"అమ్మా, అమ్మా, తమ్ముడు నిద్దరపోయాడా?" అన్నాడు బాబు ఆ అమ్మ అన్న పదంలోని తీయదనాన్ని తనివిదీరా ఆరగిస్తూ.

"అవును బాబూ, తమ్ముడు నిద్రపోయాడు. మనిద్దరం మంచి మంచి కబుర్లు, కథలు చెప్పుకుందాం. పద" అంది బాబు చెయ్యి పట్టుకొంటూ.

ఆకసంలో చవితి చంద్రుడు వయ్యారం ఒలకపోస్తున్నాడు. అమ్మ ఒళ్ళో బాబు మురిపాలు కురుస్తున్నాడు. యిద్దరి మనసులను ముడిపెట్టిన మాతృ బంధం, వారిద్దరి చుట్టూ అనురాగ వలయాలను అల్లుతుంది.

'నాకూ అమ్మ ఉంది' అనుకొన్నాడు బాబు.

'నా కిద్దరు బిడ్డలు' అనుకొంది వాసంతి.

"నీకు తెలియదు కాని, వాసంతి మంచిపిల్లరా" అని తమ్ముడిని నమ్మింప జూస్తుంది చావిట్లో రామాయమ్మ.